శ్రీ భరద్వాజ

# సద్గురువాణి




సంపుటి - 16 జనవరి, ఫిబ్రవరి, మార్చి - 2016 సంచిక - 1

## శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

ప్రధాన సంపాదకులు : శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు

"సాయిమాస్టర్ భక్త సమ్మేళన" ప్రత్యేక సంచిక

నిర్వహణ : శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము

"నేను చెప్పదలచింది, చేయదలచింది అంతా నా రచనల ద్వారా మీకందించాను" - ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## విషయ సూచిక


సామాజిక సేవలో చిత్రమాళిక .............. లోపలి కవర్‌పేజీ
1. విషయసూచిక .............. 1
2. మా మాట .............. 2
3. మహిమలు - మహనీయులు .............. 4
4. నూతన సంవత్సర సందేశం .............. 5
5. సాధన సంస్కారం .............. 6
6. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు .............. 7
7. మార్గదర్శి - మాస్టర్ .............. 9
8. మనసే మందిరం .............. 10
9. శ్రీగురు చరితామృతము .............. 11
10. ఒక్క క్షణం .............. 13
11. శ్రీ త్రైలింగస్వామి .............. 14
12. జిజ్ఞాస .............. 15
13. పూర్ణ అంతరంగాలు .............. 17
14. పండుగలు - పర్వదినాలు .............. 20
15. నిజమైన ఫకీరు .............. 21
16. ట్రస్టు కార్యాచరణ నివేదిక .............. 22
17. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో .............. 24
18. మేము సహితం .............. 27
19. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాళిక .............. 28
20. జన్మదిన శుభాకాంక్షలు .............. 30
21. సిద్ధాన్న భోజనం .............. 34
22. మాస్టారు చూపిన మహాత్ములు .............. 35
23. నమస్కార్ మాస్టర్ ఇ.బి. .............. 37
24. తెలుసుకుందాము .............. 38
25. కారణజన్ములు .............. 39
26. అఖండజ్యోతి శ్రీ ఆచార్యులు .............. 40
27. సాయిమాస్టర్ ప్రణాళిక .............. 41
28. దట్ ఈజ్ సాయి మాస్టర్ .............. 43
29. మాస్టారు చూపిన సాయి బాట .............. 45
30. యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారు .............. 47
31. మహా శివరాత్రి .............. 50
32. ప్రేమ మూర్తి .............. 51
33. వందనమిదే సాయినాథ .............. 52
34. ట్రస్టు వార్షికోత్సవం .............. 53
35. ట్రస్టు ప్రణాళిక - 2016 .............. 54
36. ఏరిన ముత్యాలు .............. 55
37. అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్త సమ్మేళనము .............. 56


## చందా వివరములు


| | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - రూ॥ | 40/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 100/- |
| 6 సం॥ల చందా | - రూ॥ | 200/- |
| పుష్కర (12 సం॥లు) చందా | - రూ॥ | 500/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |




మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

206/ఎ, సెక్టారు నెం. 8, ఉక్కునగరం,
విశాఖపట్నం - 530 032.
ఫోన్ : 0891 - 2510817
సెల్ : 9849645224, 9490812114

E-mail : sadguruvani@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**














## పాఠకులకు, ప్రకటన కర్తలకు అందరికీ ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

కొత్త ఊహలతో, నూతన ప్రణాళికతో, కొంగ్రొత్త ఆశలతో నూతన ఆంగ్ల సంవత్సరములోనికి ప్రవేశించాము. నూతన శతాబ్దిలో అప్పుడే 15 సంవత్సరాలు గడిచిపోయినయ్యి. నూతన శతాబ్దిలోని ఈ 15 సంవత్సరాలలో ఎన్నో ఆలోచనలు, అలజడులు, ఆందోళనలు, ఇంకా ఎన్నో మరెన్నెన్నో, ఏది ఎలా జరుగుతున్నా కాలం మాత్రం తన ప్రయాణం నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. ప్రతి సంవత్సరము ఒక్కొక్క అనుభవము, ఒక్కొక్క అనుభూతి మిగిల్చి వెళ్ళిపోతున్నది. కాలగమనం ఆగలేదు, గమ్యం వైపు పయనం కొనసాగుతూనే ఉంది, మరి మన పయనమో! పుడమి తల్లి పొదివిలోని విత్తనం, పుడమి గర్భాన్ని చీల్చుకొని అంకురమై, మొక్కై, మానై ప్రకృతి సహకారంతో తాను ఎదుగుతూ, తిరిగి ప్రకృతికి సహకారియై, మానవజాతికి ఫలపుష్పాదులు అందిస్తూ, తన జీవితం సాఫల్యం చేసుకుంటుంది. గ్రీష్మ, వర్ష, శరద్ర, హేమంత, శిశిర ఋతువులు అనేక విధాలుగా స్పృశించి, ఎన్ని రకాలుగా పరీక్షించినా తనకు ఆధారమైన పుడమి తల్లిని అంటిపెట్టుకొని, వసంత ఋతువు పలుకరించగానే పరవశించి, తిరిగి నూతన తేజముతో వృద్ధి చెందుతూ ఫలపుష్పాదులు అందిస్తుంది. జీవనం కొనసాగించటం ప్రారంభించిన తరువాత పైకి ఎదగటమే కాని తరిగిపోవటం తెలియదు చెట్టుకు. సాయిని ఆశ్రయించిన తరువాత మనజీవితం కూడ అట్లానే సాగుతున్నదో లేదో పరీక్షించుకోమనే "బోధించేది ఏముంది, చెట్టును చూసి నేర్చుకో" మని బాబా బోధించటములోని భావం. కనీసం గత పదిహేను సంవత్సరాలుగా సాయిని సేవిస్తున్నామని భావిస్తున్నా, అందుకు తగ్గ పరిణితి మనలో కలిగిందా! ఎదుగుదల లేక, ఫలవంతం కాని చెట్టును మనం ఉపేక్షిస్తామా? మరి సాయి చెంత చేరి కోరికలు, కష్టాలు తీర్చుకుంటూ, బాబా బోధను అర్థం చేసుకుని ఆచరణ చేయని వారిని సాయి ఉపేక్షించాలా! బాబా ఉపేక్షిస్తూనే ఉన్నారు, "పిల్లవాడు కాలు మీద మలం ఏరిగితే కాలును నరుకుతామా! బిడ్డను నరుకుతామా!" అన్నారు సాయి. అవగాహన రాహిత్యంతో మనం చేసే చేష్టలు కూడ బాబాకు అంత బాధ కలిగిస్తున్నాయేమో, అయినా ఉపేక్షిస్తున్నారు, "ఒకటికి రెండుసార్లు హెచ్చరిస్తాను, వినకపోతే నీ మానాన్న నిన్ను వదిలివేస్తాను" అన్నారు సాయి. మరి సాయి మనల్ని వదిలేరా, మనమే సాయిని వదిలేశామా! బాబాను వదలని పక్షంలో ఆశ, భయం, ఈర్ష, ద్వేషం, స్వార్థం పూర్తిగా మనలను వదలిపోలేదేమి? ఇంకా కోరికలతో సతమతమవుతూ అవి నెరవేర్చుకుంటానికి అనేకదారులు ఎందుకు వెదుకుతున్నాము? అసంపూర్తిప్రయత్నంతో కోరుకున్నది పరిపూర్ణం కాలేదని ఎందుకువాపోతున్నాము. "ఆత్మ విచారణ ఒక్కటే ఆధ్యాత్మిక విద్యలో సరియైనది".

నూతన సంవత్సరములోనికి అడుగు పెట్టే తరుణంలో గతించిన దానిని గురించి చింతించటము వలన ఉపయోగం గాని, రాబోయే దానిని గురించి ఆశల లోకంలో విహరించటం వలన గాని ఉపయోగం లేదు.

**"వర్తమానంలో జీవించటానికి, గతాన్ని సోపానాలుగా ఉపయోగించుకున్నప్పుడు మాత్రమే, భవిష్యత్తు శిఖరాలను అధిరోహించగలము".** "మనిషి మనిషిగా, మానవత్వం కలిగి మహనీయుడుగా మారటానికి ఈ దేహం వేదికగా, తన జీవితాన్ని కొనసాగించటానికి మన పూర్వీకులు, ఏర్పాటుచేసిన నిర్దుష్టమైన మార్గము ఆధ్యాత్మికత". గుళ్ళు గోపురాల చుట్టూ తిరుగుతూ కేవలం ఫోటోలోనో, విగ్రహంలోను భగవంతుడు ఉన్నాడు అని భావిస్తూ, అంతవరకే తమ ఆరాధనలు పరిమితం చేసుకున్నవారు ఆ భగవంతుడి గురించి తెలుసుకోని వారే అవుతారు. "సద్గురువు గురించి తెలుసుకోని వారు, తమ అంతిమ యాత్రకు ఏర్పాటు చేసుకునే వారే అవుతారు" అని అన్నారు బాబా. "సాయి అంటే అయిదున్నర అడుగుల మనిషి శిరిడీలో ఉన్నాడు అని అనుకునే వాడు నన్నసలు చూడనట్లే. నీవు చూసేదంతా కలసి నేను" అని అన్నారు బాబా. సర్వత్రా వ్యాపించిన చైతన్య స్వరూపుడు, దత్తావతారుడు అయిన సాయిని నిరంతరం గమనిస్తూ, ఎరుకగలిగి జీవించ గలిగి నప్పుడు మాత్రమే, గడుస్తున్న ప్రతి క్షణము మృత్యువువైపు కాకుండా అమృతత్వం వైపు నడిపే సోపానాలు అవుతాయి. నూతన సంవత్సర ఆగమనాన్ని అభిలాషిస్తూ ఇతరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితం సుఖమయ ఆనందాలతో కొనసాగాలని కోరుకుంటూ, ఇతరుల నుంచి మనమూ అదే ఆశిస్తాము. అయితే అందుకు తగిన రీతిగా జీవించగలుగుతున్నామా? శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదిస్తానని దత్త స్వరూపుడయిన సాయి తన అవతార లక్ష్యం, లక్షణంలో భాగంగా మనకు చేరువ అవుతుంటే, ఆ దిశగా మనమూ అడుగులు వేస్తూ, మరింతగా బాబాకు చేరువ అవుతున్నామా లేక వెనకడుగు వేస్తూ దూరం అవుతున్నామా? మనం పొందలేనిది, ఇతరులకు ఏమి అందించగలము?

"ఆచరణాత్మకం కాని ఆలోచనలు, ఆశయాలు అధో:పాతాలానికి మార్గాలు". కాలం కర్పూరంలా హరించుకుపోతున్నది. భగవంతుని దివ్య తేజస్సుని తనలో నింపుకొని అందరికీ అందిస్తూ తాను హరిస్తూ, చైతన్యంలో లీనమవుతుంది కర్పూర కళిక. భూమిలో పాతిన విత్తనం కాలం గడుస్తున్న కొద్దీ, పుడమితల్లిని చీల్చుకొని బయట ప్రపంచంలోకి వచ్చి మొక్కగా, మానుగా తాను ఎదుగుతూ ఎందరో జీవితాలకు అనేక విధాలుగా ఆలంబనగా నిలచి తనువు చాలిస్తుంది. మరి భగవంతుడు తనలాగానే శరీరాకృతితో సృష్టించిన మనిషి ఏమిచేస్తున్నాడు? ఏమి కోరుకుంటున్నాడు, ఏమవుతున్నాడు.

ఎన్నో సంవత్సరాలుగా సాయిని సేవిస్తూ, అవసరాలు తీర్చుకుంటున్నా, మనము కాలంతో పాటు పరిణితి చెందుతూ బాబా మెచ్చేలా వికసిస్తూ సాయి సుగంధం అందరికీ పంచుతున్నామా! లేక ఎన్నో సంవత్సరాలుగా ఆరాధిస్తున్నా మొగ్గలాగానే ఉండిపోతున్నామా! "సృష్టిలో మార్పు అన్నది అనివార్యము, ఆ మార్పు పండు పండటంలాగా ఉండాలి కాని, కుళ్ళిపోవటం లాగా కాదు" అంటారు మాస్టర్ ఇ.బి. మన జీవితంలో ఎన్నో సంవత్సరాలు, వసంతాలు వచ్చి వెళ్ళిపోతున్నాయి, మరలా వస్తున్నాయి. మరి సాయిని ఆశ్రయించిన మన జీవితం నందనవనం చేసుకుంటూ, ఆహ్లాదాన్ని అందించగలుగుతున్నామా లేదా అన్నది పరిశీలన చేసుకొనటానికి చేసేవే పండుగలు, పుట్టిన రోజులు, నూతన సంవత్సర వేడుకలు. చాలా తొందరగా ఈ సంవత్సరము గడిచిపోయింది అని ఆనందిస్తాము, కాని ఆయుస్సు తరిగిపోతున్నది అని ఆలోచించి, మనిషిగా పుట్టినందుకు మన కర్తవ్యం, గమ్యం వైపు పయనం సాగుతున్నదా లేదా అన్నది ఆత్మావలోకనం చేసుకున్నప్పుడే నిజమైన పండుగ. "క్షణక్షణమూ ఆత్మవికాసానికై కృషి చేయటము ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి" అంటారు సాయి మాస్టర్ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. వేదవిదులైన శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యుల నాల్గవ కుమారుడైన శ్రీ భరద్వాజ, తీవ్రమయిన అన్వేషణ కొనసాగించి, శాస్త్రాలలోని నిజాల్ని నిగ్గు తేల్చుకుంటూ, తన పయనంలో ఎందరో మహాత్ములను దర్శించి, ప్రశ్నించి, సమాధానపడని శ్రీ మాస్టారు, 1963 ఫిబ్రవరి 9వ తేదీన సాయి సన్నిధిలో తాను పొందిన "విశ్వచైతన్యానుభూతి"తో "సాయి దర్శనంతో నా అన్వేషణ సంపూర్ణమయింది" అని తెలపటమే కాక, తాను పొందిన ఆధ్యాత్మిక ఫలాల్ని అందరికీ పంచుతూ, సాయి నిజతత్వమైన దత్తాత్రేయ, అవధూత తత్వాన్ని ఆంధ్రావనికి అందించి, నిర్దుష్టమైన సాయి మార్గాన్ని ఏర్పరచి, హేతువాదులకు, నాస్తికులకు కూడా సమాధానమిచ్చేలా సాయి సంప్రదాయాన్ని అందరికీ అందించారు. వారందించిన 'సాయి' అనే మధురఫలాలను అందరితో కలసి పంచుకోవాలనే భావనతో 2000, 2001 సంవత్సరములలో విశాఖ ఉక్కునగరములో మొదటి, రెండవ "అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్త సమ్మేళనములు" నిర్వహించి, 2001 నుంచి **"శ్రీ భరద్వాజ సద్గురువాణి"** ద్వారా నిర్దుష్టమైన శ్రీదత్తసాయి మార్గాన్ని అందిస్తూ, అందరితో కలసి పంచుకోవటానికి మావంతు ప్రయత్నం చేస్తున్నాము. నాడు ప్రారంభించిన సమ్మేళనాలు ప్రతి సంవత్సరము రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతములో నిర్వహించబడుతూ, 17వ అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనము, 2016 ఫిబ్రవరి 7,8 మరియు 9 తేదీలలో పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు గృహస్తుగా మనకు లభ్యమవ్వటానికి కారణభూతులై, గిరిజనుల హృదయాలలో రాముడిగా కొలువై, శ్రీ పాకలపాటి గురువుగారుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ దామరాజు వెంకటయోగీంద్రుల ఆశ్రమము–ఉత్తరవాహిని ఒడ్డున, నర్సీపట్నం – విశాఖపట్నం జిల్లాలో, శ్రీ శిరిడీసాయిసేవాట్రస్టు – శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమ కార్యవర్గము సహకారముతో నిర్వహించబడుతున్న శుభసందర్భములో ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చూపిన నిర్దుష్టమైన సాయిమార్గం అందరికి అందించాలనే భావనతో "శ్రీ భరద్వాజ సద్గురువాణి" జన్మదిన సంచికను **"సాయి మాస్టర్ భక్త సమ్మేళనము"** ప్రత్యేక సంచికగా రూపొందించటము జరిగింది. సామాన్య సంచికకు భిన్నముగా, ఈ సంచికలో వీలయినంతవరకు, లక్షలాదిమందికి సాయి విశ్వతత్వమైన అవధూత సంప్రదాయాన్ని అందించిన శ్రీ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జీవిత విశేషాలు, బోధనలతో కూడిన విశేష వ్యాసాలతో, మరింత ఎక్కువ పోజీలతో, ప్రత్యేక సంచికగా రూపొందించటము జరిగింది. ఈ సంచిక నుండి "తెలుసుకుందాము" అనే కొత్త శీర్షికను ప్రారంభిస్తున్నాము అందరినీ అలరిస్తుందని ఆశిస్తాము. అందరూ నిర్దుష్టమైన సాయి మార్గంలో పయనం చేసి, సంపూర్ణమైన సాయికృపను సర్వులు పొందాలన్నదే మా ఈ ప్రయత్నము.

గత 15 సంవత్సరాలుగా శ్రీ భరద్వాజ సద్గురువాణిని, ఆదరిస్తూ, ప్రోత్సహిస్తూ, సాయి సంప్రదాయ ఆధ్యాత్మిక త్రైమాస పత్రికలలో అగ్రగామిగా నిలవటానికి కారకులైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు. కేవలం ఆధ్యాత్మిక – సామాజిక సేవలో భాగంగా శ్రీ శిరిడీ సాయి సేవాట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ ద్వారా వెలువడే **"సద్గురువాణి"** రాసి, వాసిలో ఎటువంటి రాజీ పడకుండా నిరంతరం మీ హృదయవాణిగా తీర్చిదిద్దే ప్రయత్నం కొనసాగిస్తామని శ్రీ భరద్వాజ సద్గురువాణి 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ వసంతములోనికి అడుగిడుతున్న శుభసందర్భములో, మా కర్తవ్యంలో పునరంకితమవుతామని సవినయముగా విన్నవించుకుంటూ, అందుకు మీ సహాయ, సహకార, సలహా, సూచనలు, ఆదరాభిమానాలు నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ...




**17వ అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్త సమ్మేళనము మరియు మహాశివరాత్రి శుభాకాంక్షలతో...**

**మీ పబ్లిషర్**

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

# మహిమలు - మహనీయులు

తాజుద్దీన్ బాబా, సాయిబాబా వంటి మహనీయులు, భక్తులకు ఏదైనా చెప్పాలనుకుంటే (సమాధికి ముందు, సమాధి అనంతరం) నేరుగా భౌతిక శరీరంతో దర్శనమిచ్చి గానీ, స్వప్నంలో లేదా ధ్యానంలో దర్శనమిచ్చి చెప్పాల్సిన సందేశం చెప్పారు. ఇలా మహనీయులు ఎంతోమందికి మార్గదర్శకులైన సంఘటనలు ఆయా చరిత్రలలో చూడగలం. అంతేగానీ, మలమూత్రాదులతో, నీచ సంస్కారాలతో, అదుపులేని ఆశలతో, స్వార్థభరిత కోర్కెలతో, ఎప్పుడూ వక్రమార్గాలు ఆలోచించే కుచ్చిత మనసుతో మోసపూరిత చర్యలతో, మురికి కూపము, తుచ్ఛము అయిన మానవ శరీరాన్ని ఆశ్రయించాల్సిన అవసరం మహనీయులకు లేదు. భక్తులతో నేరుగా సంబంధాలు కలిగి ఉంటారు. అంతేగానీ, మధ్యవర్తులు అవసరం లేదు. అసలు ఏ పురాణంలోనైనా పూనకాల ప్రస్తావన ఎక్కడా చూడలేదు.



శ్రీ సాయిబాబా, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ గజానన మహరాజ్, శ్రీ వెంకయ్యస్వామి తదితర మహనీయులు శరీరంతో ఉన్నప్పుడు, వారు ఆ శరీరానికే పరిమితం కాలేదు. వారు భక్తుల ముందు ఒకచోట ఉండగానే, ఎక్కడెక్కడో అనేకచోట్ల శరీరంతో భక్తులకు దర్శనాలిస్తూ, సంభాషిస్తూ భక్తులతో గడిపిన సంఘటనలు ఆయా మహనీయుల చరిత్రలలో దృష్టాంతాలుగా నిలుస్తున్నాయి.

ఒకసారి శ్రీ శిరిడీసాయినాథుల వారు గంగగిర్ బాబా అనే సాధువుతో మాట్లాడుతూ, "మానవులను మంచి మార్గం (దైవమార్గం)లో పెట్టేందుకు అల్లా ఆదేశంతో తామొచ్చామనీ, ఇక్కడ వీరేమో క్షుద్రమైన విషయాల మత్తులో పడిపోయారనీ, కొందరు తనపై రాళ్ళు రువ్వుతున్నారనీ, కొందరు అతడు చెప్పేది వినకండి సాయి నన్ను పూనాడు" అని చెప్పి ప్రజల చేత తుచ్ఛమైన ఈతకల్లు త్రాగిస్తున్నారనీ (దైవమనే అమృతాన్ని వదిలేస్తున్నారు), పురాణవేదాంత చర్చల్లో దిగి పిచ్చివాళ్ళవుతున్నారనీ, సత్సంగంపట్ల విశ్వాసం, గౌరవం పోయి సత్యాన్ని మరుగుపరచి అసత్యాన్నే గొప్పగా ఆదరిస్తున్నారని ఎంతో వివరంగా చెప్తారు.

**అంటే, సాయిబాబా కాలం నాడే అసలైన దైవమార్గం వదలి క్షుద్రమైన సిద్ధులపట్ల మొగ్గుచూపుతూ కొందరు, మహాత్ములను తూలనాడే వారు కొందరు, తమకు ఫలానా దేవుడు లేదా మహనీయుడు పూనారని ఇంకొందరు, ఇలా ప్రక్కదారి పట్టిస్తున్నవారు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే సత్యమార్గంగా భ్రమించవద్దని సాయిబాబా మనందరినీ హెచ్చరిస్తున్నారు.**

అసలు ఏ పురాణాలలోనైనా దైవం యొక్క, మహనీయుల యొక్క గొప్పతనం పేర్కొనడం జరిగింది గానీ, ఎక్కడ కూడా పూనకాల విషయం ఇది కూడా దైవమార్గమనే విషయం ఏ పురాణ గ్రంథంలోనూ మనం చూడలేదు. అయితే సాధనలతో ఇటువంటి విభ్రమలు చెందవద్దనీ, అసలైన ఆధ్యాత్మికతను గుర్తించాలనీ 12వ శతాబ్దంనాటి టిబెట్‌యోగి 'మిలారేపా' తన శిష్యులకు వివరణాత్మకంగా చెప్తూ మనందరిని హెచ్చరిస్తున్నారు.

సాధనలో కలిగే సిద్ధులని ప్రదర్శించవద్దనీ, అవి సాధకులకు ఆధ్యాత్మిక ఉన్నతికి అవరోధాలని సాయితత్త్వాన్ని వ్యాపింపజేసిన ఆచార్యశ్రీ ఎక్కిరాల భరద్వాజగారు తెలుపుతున్నారు. అసలైన మహాత్ములను గుర్తించేందుకు, పొందేందుకు, సత్సంగాలు చేయమని, మహాత్ముల చరిత్రలు, సద్గ్రంథాలు పారాయణ చేయమనీ భక్తులకు పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారు హితవు చెబుతున్నారు.

ఒకసారి సాయిబాబా మశీదులో కూర్చుని ఉన్నప్పుడు హఠాత్తుగా ఎదురుగా వున్న ధునిలో చేయిపెట్టి తీస్తారు. దేనినో మంటలనుంచి వెలుపలికి తీసినట్లుంటుంది వారి చర్య. మంటలనుండి వెలుపలికి తీయగానే చేయి కాలి బొబ్బలెక్కి ఉంటుంది. వాస్తవానికి ఆ సమయంలో ఒక తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న భర్త పిలవగా కొలిమితిత్తి కొదుతున్న ఆమె, అదాటుగ లేచినందున ఒడిలోని పసిబిడ్డ మంటల్లో పడడం జరిగింది. ఇక్కడ ద్వారకామాయిలో ఉంటూనే ఎక్కడో ఉన్న ఆ బిడ్డను రక్షించి తల్లిని మించిన తల్లిగా శ్రీ సాయీశుడు వినుతికెక్కారు. ఈ చర్య ఎవరికి సాధ్యం?

ఒకే మార్గంలో ఎదురెదురుగా వస్తున్న రెండు రైలు బండ్లు ప్రమాదానికి గురికాబోయే సమయంలో శ్రీ వెంకయ్యస్వామి (గొలగమూడి) వాటిని నిలిపేసి ప్రమాదాన్ని తప్పించారు. ఇలా మహనీయుల దివ్యత్వం వర్ణించనలవి కానిది. ఇట్టి దివ్యత్వం మరెవరికీ సాధ్యం కాదు.

నకిలీలు ఎవరో, మహనీయులు ఎవరో తెలుసుకునేదెలా? మనకై మనం నకిలీలను గుర్తించలేము. శ్రద్ధాభక్తులతో నిష్ఠతో నిరంతరం మహనీయుల చరిత్రలు పారాయణ చేస్తూ, అనుక్షణం మననం చేసుకుంటూ ఉండాలి. ప్రతి ఘడియ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం నుంచి ఉన్నతమైన భావాలు అత్యంత శ్రద్ధతో స్వీకరించాలి. జాతకాలు, భవిష్యత్తు తెలుసుకోవడం, సిద్ధులు కావాలనుకోవడం, పైన పేర్కొన్న నకిలీలను ఆశ్రయించడం పరమ నీచమైన చర్యగా గుర్తించాలి.

సౌజన్యం : **శ్రీ తాజుద్దీన్‌బాబా చరిత్ర**

రచన : **హజరత్ శ్రీ షేక్ మహమ్మద్ మీరాసాహెబ్**, చీరాల

# నూతన సంవత్సర సందేశం

ఎంతోమంది దేవతలు–అంతకుమించిన గురువులు ఎందరో ఉండగా శ్రీ శిరిడీసాయిబాబానే ఎందుకు పూజించాలి అని చాలామందికి ఎక్కడో ఒకమూల రవ్వంత సందేహం ఉంటుంది. అంతేకాదు అది ఒక్కొక్కసారి తీవ్రముకాగా సకలదేవతాస్వరూపుడయిన సాయిని వదలి వివిధ మార్గాలవెంట పరుగెత్తటం జరుగుతుంది. అలసి, సొలసి చివరకు సాయిచెంతనే చేరుతున్నారు. అటువంటి భ్రమలలో పడకుండా ముందుగానే సాయిబాబానే ఎందుకు పూజించాలో జాగ్రత్తగా యోచిస్తే తెలుస్తుంది. సృష్టిలో ప్రతి దానికి పుట్టుక, పెరుగుదల, క్షీణించటం వంటి స్థితులుంటాయి. తద్వారా దుర్మార్గులు తమ క్రూరత్వంతో సన్మార్గులను బాధిస్తారు. సన్మార్గులు యజ్ఞ, దాన, తపస్సుల ద్వారా పరమాత్మ రక్షణకై తపిస్తుంటారు. ఈ దుర్మార్గుల పాపము, ఈ సన్మార్గుల పుణ్యము ప్రారబ్ధంగా పరిణమించి భగవంతుడు అవతార పురుషుల రూపంలో దిగివచ్చి శిష్టరక్షణ దుష్టశిక్షణ చేస్తాడు. రాముడు, కృష్ణాది అవతారాలన్ని ఇలా వచ్చినవే. రాముడు రావణాది రాక్షసుల సంహారానికి, విశ్వామిత్రాది మహర్షుల రక్షణకై అవతరించగా, శ్రీకృష్ణుడు ధర్మరాజాది సత్పురుషుల రక్షణకు దుర్యోధనాది దుష్టుల శిక్షించుటకు అవతరించారు. ఇలా అవతారాలు దుష్టులను సంహరించటం కోసం వస్తారు. అయితే అధర్మాన్ని తలెత్తనీయకుండా చేసే ప్రక్రియను భగవంతుడే చేస్తాడు. అంటే రోగం వచ్చాక వైద్యం చేసే ప్రక్రియతోపాటే, రోగం రావటానికి కారణాలను అన్వేషించి రూపుమాపే క్రియ కూడా సృష్టిలో వుంది. ఈ రెండో ప్రక్రియ నిర్వహించటానికి భగవంతుడు మహాత్ముల రూపంలో దిగివస్తాడు. అట్లా అవతరించిన మహాత్ములలో దత్తావతారుడు, జగద్గురువు అయ్యి భాసించారు శ్రీ శిరిడీసాయిబాబా. ఇక్కడ శిక్షించటం వుండదు. ప్రజలను ధర్మంలోకి మేల్కొల్పడం వుంటుంది. సమాజంలో నైతిక విలువలను ప్రతిష్టించి అధర్మం తలెత్తకుండా శ్రద్ధ వహిస్తాడు. సాయి సకల జీవస్వరూపంగా అనుభవాన్నిచ్చి సర్వులలో తనను దర్శించే తత్త్వాన్ని తన భక్తులలో నిలిపారు. ఏ జీవిని హింసించినా, తననే హింసించారని, ఆదరిస్తే తననే ఆదరించారని అనుభవాలు ఇచ్చారు. ఇలా ఇచ్చిన వారు దాదాపు లేరనే చెప్పవచ్చు. ఎప్పుడైతే సర్వులలో సాయినే దర్శించగలుగుతామో, అప్పుడు అధర్మ ప్రవర్తనకు తావే వుండదు. అంతేకాక ఏ సాధన ఫలించాలన్నా మనం సత్వగుణ ప్రధానములమయి వుండాలి. కాని సత్వగుణం ఎలా వస్తుందో ఎక్కడా చెప్పలేదు. కొందరు శ్రద్ధగా సంధ్యాది అనుష్టాది కార్యక్రమాలను చేస్తూపోతే వస్తుందన్నారు. కాని అలా చేస్తేనే రాదు అనటానికి రావణాది రాక్షసులే తార్కాణం. ఇలా సంధ్యాది కార్యక్రమాలు చేసే రావణుడే సీతాదేవిని ఎత్తుకువచ్చింది. అష్టదిక్పాలకులు రావణుని లంకను కాపలాకాసేవారట. సాక్షాత్తు బ్రహ్మ మనవడు దేవతలు ఇంటిలో పంచాంగ శ్రవణం చేసేవారట. ఈశ్వరుని తపస్సు ద్వారా ప్రత్యక్షం చేసుకున్న సాధకుడు. కానీ రజోగుణ ప్రధానుడై పవిత్రులను హింసించేవాడు. కాబట్టి తెలిసో, తెలియకనో సంధ్యాది అనుష్టాన కార్యక్రమములు ఆచరిస్తే సత్వగుణం రాదు. ప్రశ్న మళ్ళీ మొదటికి వచ్చింది. అయితే సాత్విక పదార్థాలను తింటుంటే వస్తుందనన్నారు. ఏనుగు వంటి జంతువులు కేవలం సాత్విక పదార్థాలైన పండ్లు వగైరా తీసుకుంటాయి. వాటికి సత్వగుణం లేదు. అంతేకాదు ఇలా సాత్విక పదార్థాలను తింటూ వుంటే సత్వగుణమొస్తుందని ఎక్కడా చెప్పలేదు. భగవద్గీతలో సత్వగుణ సంపన్నులు ఏ పదార్థాలు ఇష్టపడతారో చెప్పివుందికాని, ఈ పదార్థాలు తింటే సత్వగుణం వస్తుందని ఎక్కడా చెప్పలేదు. ఎట్లా ప్రశ్న తిరిగి మొదటికి వచ్చింది. సత్వగుణం వస్తేగాని యజ్ఞ, దాన, తపః కర్మలు సిద్ధించవు. దాని దుంపతెగ, సత్వగుణమెలా వస్తుందో ఎక్కడా చెప్పిచావకపోయె. ఎట్లా ఈ సమస్య తెగేది. చివరకు శ్రీ శిరిడీసాయి పాదాలనాశ్రయించాక మాత్రమే సమస్య పరిష్కారమైంది. నానాసాహెబ్ చందోర్కర్ సంస్కృతం బాగా చదువుకున్నాడు.



ద్వారకామాయిలో బాబాపాదసేవనం చేస్తూ తనలో చెడ్డ ఆలోచనలు రాకుండా ఉండేందుకు భగవద్గీత పారాయణ చేస్తున్నాడు. చెడ్డ ఆలోచనలువస్తే బాబా తిట్టేవారు. ఒక్కొక్కసారి కొట్టేవారు. ఇలా చేస్తే పదిమందిలో పరువుపోతుంది. కాబట్టి చెడ్డ ఆలోచనలు రాకుండా గీత పారాయణ చేసుకుంటున్నాడు. చాలాసేపు పారాయణ చేసుకోనిచ్చారు. నాల్గవ అధ్యాయం 34వ శ్లోకం దగ్గరకు వచ్చాక సాయి "ఏమిటి గొణుగుతున్నావు" అన్నారు. ఇది సంస్కృతంలే. భగవద్గీత అంటారు. అందులోని శ్లోకాలను పారాయణ చేసుకుంటున్నాను అన్నాడు. బాబాకు సంస్కృతం రాదని, చదువుకోలేదని అతని అభిప్రాయం. భగవంతుని గురించిన గీతాలైతే కాస్త పెద్దగా చదవరాదా, నేను కూడా వింటాను అన్నారు బాబా. "త్వద్విద్ధి" శ్లోకం పెద్దగా చదివేడు చందోర్కర్. ఈ శ్లోకంలో చెప్పివుంది సత్వగుణమేల వస్తుందో. ఈ శ్లోకం దగ్గర సాయి, నానాను ఎందుకు ఆపారు అని చాలారోజులు యోచించాను. చివరకు తెలిసింది. ఇందులో భగవద్గీత ఎలా పుట్టిందో చెప్పబడి వుంది. సత్వగుణమెలా వస్తుందో చెప్పబడి వుంది. అజ్ఞాన జనితమైన సుఖదుఃఖాల వంటి ద్వంద్వాల నుండి బయటపడాలని కోరుకునేవాడు, ఇంద్రియ మనోజనితమైనదే సత్యమన్న భ్రాంతి నుండి బయట పడదలచుకున్న ముముక్షువు సాయినాథుని వంటి సద్గురువునాశ్రయించి, ఆత్మ సమర్పణ చేసుకుని శరణాగతిపొంది

పరిప్రశ్న చేయాలని ఆ శ్లోకంసారం. సద్గురువులు మాత్రమే ఈ జగత్తును భగవన్మయంగా దర్శింపచేస్తారు. అప్పుడు వస్తుంది సత్వగుణం, తాను సుఖంగావుండి, **పదిమంది సుఖపడాలని కోరుకునేవాడే సత్వగుణ ప్రధానుడు. తాను ఎవరినెత్తిన చేయిపెడితే వాడు కాలిపోవాలని కోరుకునేవాడు తమోగుణ ప్రధానుడు. పదిమంది దుఃఖంలో వుంటేనేగాని తనకు తృప్తిలేదనుకునేవాడు రజోగుణ ప్రధానుడు. సత్వగుణ ప్రధానుడు చేసే ప్రతిపని సిద్ధిస్తుంది.** చేలో గింజనాటి పదిగింజలు ఇంటికి తెచ్చుకోవటం లాంటిది సత్వగుణ ప్రధానుడి దృష్టి. కొందరు మందిరాలకు విరాళాలు ఇస్తుంటారు. ఇది పుణ్యకార్యమే కాని ఇచ్చేటప్పుడు మా పెద్దలపేర్లు ప్రస్ఫుటంగా కన్పించేటట్లు మందిరంలో వేస్తారా అని అడుగుతుంటారు. ఇలా వేయటం వెనుకవున్న అంతరార్థం తెలుసుకుంటే ఎవ్వరూ అడగరు. అలా పేరు వెయ్యాలన్న కోరికతోనే కదా మీరు విరాళం ఇచ్చారు. పేరు వేశాం కనుక మీరు విరాళం ఇచ్చిన ప్రయోజనం నెరవేరింది కనుక మీకు సాయికి మధ్యలో ఎటువంటి ఋణానుబంధం వుండదు. ఈ జన్మకుగాని, రాబోయే జన్మకుకాని మీరు బాబా నుండి పొందేది ఏమీ లేదు. ముక్తి, మోక్షం లాంటివి వారు ఇవ్వగలరు. దుఃఖరాహిత్య స్థితిని గూడా ఇవ్వగలరు. కాని మీరు మాత్రం ఆయన నుండి పొందేది వుండదు. అలాకాక సాయికి దక్షిణగా ఈ విరాళాన్ని సమర్పించామన్నారనుకోండి. ఆయన సకల జీవ స్వరూపుడు. సకల దేవతా స్వరూపుడు సకల సాధు స్వరూపుడు. ఇంత మందికి దక్షిణనిచ్చిన పుణ్యం మీకు దక్కుతుంది. ముక్కోటి దేవతలకు దక్షిణ సమర్పించిన పుణ్యం మీకు దక్కుతుంది. ఇది సామాన్యమైన పుణ్యమా యోచించండి. అలా పేరు వెయ్యమనడం రజోగుణ ప్రధానమైన కోరిక. ఇందులో ఏముంది. 100 రూ. నోటుకు చిల్లర మార్చుకుని ఆనందించటం లాంటిది. తెలివిగలవారు కోరుకోవలసినదిట్లానే. ఇది చిన్న పిల్లల మనస్తత్వం. జేబు బరువుగావుంటే చూచుకొని నా దగ్గర చాలా డబ్బుందని సంతోషించటం. కాబట్టి సద్గురువును సేవించటం వల్ల సత్వగుణ ప్రధానులమవుతాము. ఇలా అనుభవాలనిచ్చిన సద్గురువు మరొకరు లేరనే చెప్పాలి. కాబట్టి మనం తప్పక సాయిని మాత్రమే సేవించాలి. అప్పుడే మనకు అజ్ఞానజనితమైన దుఃఖస్పర్శయేలేని తృప్తి, ఆనందాలు మన సొమ్ము అవుతాయి. ఇదే గదా జీవిత లక్ష్యం. మనమంతా సత్వగుణ సంపన్నులమై ఈ ఆంగ్ల నూతన సంవత్సరములో సాయిని మరింతగా సేవించి ఇహపర సుఖాలను పొందాలని అటువంటి సంస్కారాన్ని సద్గురు సాయినాధుడు మనకందరికి ప్రసాదిస్తాడని ఆశిస్తూ, నూతన సంవత్సర శుభాకాంక్షలతో సెలవు తీసుకుంటున్నాను.

**– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

ఒకానొక సందర్భములో పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చెప్పిన సత్సంగములోని అమృత సందేశాన్ని శ్రీ జె.వి. సుబ్బయ్యమాస్టారుగారు సేకరించి, "సద్గురుస్మృతులు" ద్వారా అందించగా, దానిని నూతన సంవత్సర సందేశముగా మీ అందరితో కలసి పంచుకొంటున్నాము. **– సంపాదకుడు**

# సాధన సంస్కారము

"సంస్కారముల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన" అంటారు ఆచార్య శ్రీఎక్కిరాల భరద్వాజ. మనలోని భావాలు మాటల రూపంలో వక్తమయ్యి, క్రియారూపం దాలుస్తాయి. ఆభావాలు జన్మతః లభించిన సంస్కారము వలన, ఆ సంస్కారాలు గతజన్మల ద్వారా మనకు సంక్రమించటము వలన జరుగుతుంది. గత జన్మతః సంక్రమించిన సంస్కారములోని దుష్కర్మలను ఇప్పటి కర్మ సంస్కారము వలన తొలగించుకొని ఉన్నత పథంవైపు నడిచి జన్మసార్ధకత చెందించుకోవటానికి మానవుడికి మాత్రమే లభించిన ఒక అద్భుతమైన వరం మానవజన్మ. జన్మసార్ధకత చెందించుకోవటానికి సర్వము త్యజించి సన్యాసము స్వీకరించినవారు కూడా సంస్కారముల మార్పుకోసం ప్రయత్నం చేయకపోతే జరిగే పర్యవసానం ఏమిటి ఈ క్రింద కథ తెలియజేస్తుంది.

ఒక నదీతీరములో కొందరు సన్యాసులు ధ్యానము చేసుకొనుచుండగా ఆసమయములో నీటికై నదికి వచ్చిన స్త్రీలలో ఒక యువతి సౌందర్యానికి అచ్చెరునొందిన ఒక సన్యాసి మనస్సు వశము తప్పి ధ్యానభంగమై నిగ్రహించుకోలేక సన్యాసము వదలి గృహస్థుడై ముగ్గురు బిడ్డల తండ్రి అయ్యెను. అతని ప్రక్కన ధ్యానము చేసుకుంటున్న సన్యాసి మాత్రము అనతికాలములో సాధన పరిపూర్ణముగా చేసుకొని లోకకళ్యాణార్ధమై జీవితాన్ని కొనసాగించెను. వీరి గత జన్మలను పరిశీలించి చూడగా, రెండవ సన్యాసి గత జన్మలో ఎద్దుగా జన్మించి, అదియవ్వనము వరకు తోటి ఆవుమందలతో కలిసి తిరగగా తదుపరి, అంబోతు ముద్రవేసి శివార్పణ చేసిరి. మొదటి సన్యాసి లేగదూడ వయస్సునంచే నుదుటిపై త్రిశూలముద్రవేసి, శివార్పణచేసి, మహాశివుని ప్రతిరూపముగా భక్తులు పూజించడముతో కామ వాసన కోల్పోయి ఆ ఎద్దు సన్యాసిగా జన్మించి, గతజన్మ సంస్కార వాసనల వలన, సన్యాసము వదలి, గృహస్థు అయ్యెను. గత జన్మలో కామవాసనలు ఉడిగిన రెండవ సన్యాసి, తన సాధనకొనసాగించెను. కనుక సంస్కారములు అంత బలీయమైనవి కనుకనే **"సంస్కారముల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నమే సాధన"** అంటారు సాయిమాస్టర్ ఆచార్య శ్రీఎక్కిరాల భరద్వాజగారు. అందుకు సద్గురువు సమాశ్రయము ఒక్కటే శరణ్యము. లభించిన సద్గురువు సంపూర్ణమైన అనుగ్రహము పొందటానికి మానవాళికి రెండు నేత్రములవంటి శ్రీగురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతముల పారాయణ పరమావధి అంటారు మాస్టర్ ఇ.బి. వాటి పారాయణల ద్వారా మన సంస్కారాలను ఉత్తమముగా తీర్చిదిద్దుకొని జగద్గురు శ్రీ శిరిడీసాయి సంపూర్ణమైన అనుగ్రహము పొందటానికి ప్రతి ఒక్కరము ప్రయత్నం కొనసాగించాలని కోరుకుంటూ...

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

– **శ్రీమతి వై. సాయిశిరీష**, బెంగుళూరు

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

"మా సంప్రదాయమే వేరు నేను చెవిలో ఉపదేశించను" అన్నారు శ్రీ శిరిడీసాయిబాబా. ఆధ్యాత్మిక పరిణతికి ఒక గురువును ఆశ్రయించి మంత్రోపదేశము పొందనిదే మానవజన్మ సార్ధకత చెందదని చెబుతున్న, అనాదిసిద్ధమైన సంప్రదాయాన్ని సాయి కాదనటంలోని ఆంతర్యము ఏమిటి? సకల జనావళిని ఉద్ధరించటానికి అవతరించిన దత్తావతారుడైన శ్రీసాయి చెప్పింది వారివరకే పరిమితము అని అనుకుందాము అంటే, "ఇక్కడకే కాదు మరెక్కడకూ కూడ ఉపదేశము కొరకు పరిగెత్తవద్దు" అన్నారు శ్రీ శిరిడీసాయినాధుడు. దైవంయొక్క నామాన్ని పలికితే అది నామజపం అవుతుంది. భగవంతుని ఆదేశముతో దానిని కొన్నికోట్లు జపించటం ద్వారా, జపించిన నామము మంత్రమై, జపించినవారు అద్వైతస్థితిని పొంది, ఏకత్వభావముతో జీవిస్తున్న వారిద్వారా, వారు జపించిన నామం స్వీకరించటమే మంత్రోపదేశము అంటే. ఉదాహరణకు ''ఓం నమశివాయః'' అనే అష్టాక్షరిని ఉచ్చరించటము నామజపము అయితే, దానిని సిద్ధిపొందిన వారిద్వారా ఆనామాన్ని స్వీకరించటము మంత్రోపదేశము అవుతుంది.



నేటి కలిప్రభావానికిలోనై, అనేక వత్తిడులతో యాత్రికజీవనం కొనసాగించే నేటితరములో, మంత్రోపదేశము చేసేవారు, పొందేవారు అరుదైపోయారు. అలనాడు గీతోపదేశము చేయటానికి కృష్ణుడికి అర్జునుడు ఒక్కడే లభించాడు. ఉపదేశము అంటే ఎక్కడో ఉన్నాడు అని అనుకునే పరమాత్మ ఇప్పుడు ఇక్కడే నీతో నీలో ఉన్నాడు అని ప్రత్యక్ష నిరూపణ చేయటమే మంత్రోపదేశ ప్రధాన లక్ష్యం. శ్రీరామకృష్ణ పరమహంసకు వివేకానందుడు ఒక్కడే లభించాడు. "నా దగ్గర ఆధ్యాత్మిక ధనం రాసులు రాసులుగా పోసి ఉన్నది ఒక్కడూ దానివైపు తేరిపార చూడటం లేదు, అందరూ ఇవ్వు, ఇవ్వు అని అడుగుతున్నారే గాని, నేను ఇవ్వదలచింది పొందదగినవాడు ఒక్కరూ కనిపించలేదు" అన్నారు సాయి. అందించేవారున్నా అందుకునే అర్హత ఉన్నవారు కావాలికదా! కోట్ల ఆస్తికి అధిపతియైనవారు కూడ, అర్హతలేని తన కుమారుడికి ఆస్తిఇవ్వనట్లు-ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన సాయినాధుడు కూడ ఆశాభయాలకు లోనై తన చెంతచేరినవారిని చూసి, నేను ఇవ్వదలచింది పొందదగినవాడు ఒక్కడూ కనిపించలేదు అని అన్నారు. గాయత్రి మంత్రసిద్ధిపొంది, శ్రీ పాకలపాటి గురువుగారిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ దామరాజు వెంకటయోగీంద్రులు కూడ, ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారితో "మంత్రోపదేశము సొంతకారు ప్రయాణం లాంటిది, ప్రతిక్షణము ఏమరుపాటు లేకుండా ఉంటేనే గమ్యం చేరగలము, అదే సాయి సంప్రదాయమంటే టూరిస్టు బస్సు ప్రయాణం లాంటిది. నిష్ట, సబూరి అనే దక్షిణ సమర్పించి ప్రయాణానికి అర్హత పొందితే, సర్వమూ తానై ఉండి, చివరికంటా ఉండి గమ్యం చేరుస్తారు సాయి" అని అన్నారు శ్రీ పాకలపాటి గురువుగారు.

హేమాద్రిపంత్‌ను నిమిత్తమాత్రునిగా చేసుకొని, శ్యామాని భాగస్వామిని చేస్తూ, "చెవిలో ఉపదేశించను" అన్న సాయి, తన సంప్రదాయం ఏమిటో ఒక అద్భుతమైన సంఘటన ద్వారా మనకందించారు. ఆ సంఘటన పూర్వాపరాలలోనికి వెళదాము.

సాఠే అనే అతను ఎన్నో కష్టాలకులోనై, సాయిసన్నిధికి వచ్చి ఒకవారమురోజులు శ్రీగురుచరిత్ర పారాయణ చేయగా, సాయి అతనికి స్వప్నదర్శనమిచ్చి మరొక్కవారంపాటు శ్రీగురుచరిత్ర పారాయణ చేస్తే అతని కోరిక నెరవేరుతుందని చెప్పగా, గత పది సంవత్సరాలుగా పారాయణచేస్తూ, సద్గురుసేవలో ఉన్న తనకు ఎటువంటి ఉపదేశము బాబా ఎందుకు చేయలేదని అక్కడ ఉన్న హేమాద్రిపంత్ మనోవ్యాకులడవ్వగా అది గమనించిన సాయి, అతనిని శ్యామా దగ్గరకు వెళ్ళి 15 రూపాయలు దక్షిణ తీసుకొని, కొద్దిసేపు మాట్లాడి రమ్మని పంపేరు. బ్రతుకుజీవుడా! అనుకుంటూ శ్యామా ఇంటికివచ్చిన హేమాద్రిపంత్, శ్యామా తన పూజ ముగించుకొని వస్తానని వెళ్ళగా, అక్కడఉన్న ఏకనాథ భాగవతము గ్రంథాన్ని చూసి, తాను ఆరోజు పారాయణ చేయకుండా కాకడ హారతికి వచ్చిన సంగతి జ్ఞప్తికి వచ్చి, ఆ పుస్తకము తెరవగా తాను ఆరోజు పారాయణ చేయవలసిన అధ్యాయము రావటంతో సాయి తనను అక్కడకు అందుకే పంపేరేమోనని భావిస్తూ పారాయణ పూర్తిచేసేసరికి, శ్యామాకూడ తన పూజ ముగించుకొని వచ్చారు. ఇద్దరు ఉభయకుశలోపరి, అతిథిమర్యాద అనంతరం ఆనవాయితీగా తాంబూలము సేవిస్తూ, "ఉన్నతోద్యోగి అయిన హేమాద్రిపంత్ సామాన్యుడనైన తన ఇంటికి రావటంలోని ఆంతర్యము'' గురించి శ్యామా అడుగగా, హేమాద్రిపంత్ 'సాయి మీ దగ్గరనుండి 15 రూపాయలు దక్షిణ తీసుకొని, కొంతసేపు ముచ్చటించి' రమ్మన్నారని తెలుపగా, నెలకు కేవలం 5 రూపాయలు జీతానికి పనిచేసే తన దగ్గర అంత పైకం ఉండదని బాబాకు తెలుసు. ఉన్నతోద్యోగి అయిన మీరు, అతిసామాన్యుడనైన నాదగ్గరకు వచ్చి దక్షిణ అడగటముతో నామోషి చెందకూడదని, బీదవాడినైన నేను, సాయి అడిగినంత దక్షిణ సమర్పించలేకపోయినందుకు ఆత్మనూన్యతకు లోనుకాకూడదని బాబా భావం అయిఉండవచ్చు. సర్వ హృదయాంతరస్థి అయిన

సాయికి నా పదిహేను నమస్కారములు దక్షిణ సమర్పిస్తున్నాను. అయినా బాబా చర్యలలోని, మాటలలోని భావాలు సంపూర్ణముగా అర్థంచేసుకోవటం సామాన్యమైన విషయం కాదు. మారుతి ఆలయంలో నివసించే దేవదాసు, వేదాంతి అయిన జానకీదాసు మొదలైన వారే, బాబా మాటలకు అత్యంత విలువనిచ్చి, అత్యంత జాగురూకతతో మెలిగేవారు, బాబా తన శిష్యుడని చెప్పుకొని తిరిగిన జవహర్ ఆలీకూడ సాయి శక్తికి తలవొగ్గి, బాబాకు నమస్కరించి వెళ్ళిపోయాడు. అటువంటి సాయి చర్యలలోని, మాటలలోని భావాలు పసికట్టటం అతిసామాన్యుడనైన నావల్లకాదు. "అయితే నాకు తెలిసింది మాత్రం, బాబా చెప్పింది చేయటము ఒక్కటే. బాబా మాటలు, చర్యలలోని భావం వెంటనే అవగతం అయినా, కాకపోయినా, వాటిని మనస్ఫూర్తిగా ఆచరించటము ద్వారా అద్భుతమైన బాబా మార్గోపదేశం మనకు లభిస్తుంది. నా అనుభవం ద్వారా నేర్చుకున్నది కూడ అదే" అన్న శ్యామా నోట ఉపదేశము అన్నమాట వచ్చిన వెంటనే ఉలిక్కిపడిన హేమాద్రిపంత్, మశీదులో తన మదిలోని భావపరంపరకు శ్యామాద్వారానైనా సమాధానము దొరుకుతుందేమోనని తలచి, బాబా కొద్దిసేపు మాట్లాడుకుని రమ్మన్న విషయాన్ని మరొక్కసారి శ్యామాకి గుర్తుచేశాడు హేమాద్రిపంత్, ఆమాటకు శ్యామా "అసమాన్యమైన బాబా లీలలు వర్ణించశక్యము కాదు. కొన్ని లీలలు సాయిసన్నిధిలో మీరు గమనించే ఉంటారు. ఎవరికి ఏ విషయం ఏవిధముగా బోధిస్తారో వెంటనే తెలియశక్యము కాదు, వారి లీలావిలాసములకు అంతేలేదు, విజ్ఞుడు అయిన మిమ్ములను సామాన్యుడినయిన నాతో ముచ్చటించి రమ్మని చెప్పటములోని బాబా ఆంతర్యము ఏమిటో తెలియదుగాని, ఇతరుల మనో నిశ్చయాన్ని గమనించి తదనుగుణముగా వారిని సంస్కరించి, ఉన్నతులుగా తీర్చి దిద్దటము మాత్రము బాబా చర్యలలోని భాగమే. ఇట్లా అంటుంటే బాబా సన్నిధిలో జరిగిన ఒక సంఘటన నాకు బాగా గుర్తుకువస్తున్నది. ఆ సంఘటనలో నేను ప్రత్యక్ష భాగస్వామినే. భక్తుడి మనోనిశ్చయము, పట్టుదల ననుసరించి సాయి ఎంతగా వారిని అనుగ్రహిస్తారో, ఒక్కొక్కసారి అంతే కఠినముగా కూడ పరీక్ష చేసిన తరువాతే ఉపదేశించటము నేను ఎరుగుదును.

ఉపదేశము అనేమాట వినగానే హేమాద్రిపంత్ మరొక్కసారి సాఠే గురుచరిత్ర పారాయణ, బాబా ఉపదేశము, తన మదిలో కలిగిన అలజడి మరొక్కసారి గుర్తుకురాగా, తనని అనుగ్రహించుటకే సాయి ఇక్కడకు పంపిఉంటారని విశ్వసించి, తనలోని భావాలను అణచుకుంటూ, "ఆసంఘటన విశేషాలకు ప్రత్యక్షసాక్షి అయిన మీద్వారా వినటం వలన, సాయి చెప్పిన పని కూడ చేసినట్లు అవుతుంది. కనుక, ఆ సంఘటన గురించి తెలియజేయమని" అడిగిన హేమాద్రిపంత్‌ను చూస్తూ, సాయి ఉపదేశసారము అయ్యి, సాయి సంప్రదాయానికి మూలపట్టు అయినటువంటి ఆ అద్భుత సంఘటన గురించి చెప్పటము ప్రారంభించాడు శ్యామా.

"సంగమేరు గ్రామానికి చెందిన శ్రీ ఖాశాబా దేశ్‌ముఖ్ తల్లి అయిన రాధాబాయి దేశ్‌ముఖ్ అనే ముసలావిడ బాబా ప్రఖ్యాతి విని గ్రామ ప్రజలతో కలసి శిరిడీవచ్చింది. రావటంతోనే బాబాగారి దర్శనం చేసుకొని, మహదానందపడి తన వారితో కలసి, వాడాకు వెళ్ళి అక్కడ బసచేసింది. అయితే అటు తరువాత ఆమె బసలోనే ఆహారము, నీరు మాని ఉండిపోసాగింది. బాబాపై అమితమైన ప్రేమతో ఎంతో ప్రయాసకు లోనైవచ్చిన ఆవిడ, సాయి దర్శనం చేసుకోకపోవటములోని ఆంతర్యము ఏమిటో నాకు తెలియరాలేదు. బాబా దర్శనంతో మహదానందపడిన ఆమె, తిండి, నీరుమాని ఉండటంలోని ఆంతర్యమేమిటో తెలుసుకోవాలని స్వయముగా ఆవిడ దగ్గరకు వెళ్ళేను. తిండిలేక నీరసించిన ఆమెనుచూసి బాధ కలిగింది. ఆమె చెంతకు చేరిన నేను, ఎంతో అనునయముగా ఆమె చర్యలోని భావము ఏమిటో పదేపదే అడిగినమీదట, ఆమె పెదవివిప్పి మనస్సులోని మాట చెప్పింది. "నాకు చిన్నతనంనుంచి దైవభక్తి ఎంతో ఎక్కువ, మెట్టినింటకూడ అందుకు అవకాశము కలగటముతో ఇష్టదేవతారాధన కొనసాగించేను, సంసారము పెద్దది అయ్యింది, పిల్లలు పుట్టి, పెరిగి, ప్రయోజకులు అయ్యారు, అయినా మనస్సులో ఏదోఒక వెలితి, భగవంతుని కృప సంపూర్ణముగా నాపై ప్రసరించలేదేమోనని ఒక భావన. ఆ సమయములో నా జీవన సహచరుడైన భర్తకూడ మరణించటముతో, మదిలో మెదిలే వెలితి బాధగా మారింది. దాని నివారణకై ప్రయత్నిస్తున్న తరుణంలో గురూపదేశమే దానికి తగిన పరిష్కారము అని తెలిసింది. గతములో చేసిన పూజలు, పునస్కారాలు, ఆచారవ్యవహారాలు, నియమనిష్ఠలకు సంప్రీతుడయిన భగవంతుడు గురువు చెంతకు చేరుస్తాడని తెలిసింది. నా ఈ చరమాంకములో నా ఆరాధనకు సంప్రీతుడైన భగవంతుడు, సాయిచెంతకు చేర్చేడు నన్ను. ప్రథమ దర్శనంతోనే బాబాపై అపారమైన విశ్వాసము కలిగింది నాకు. సర్వులను సమాదరిస్తూ, తన దరిచేరిన వారి కోరికలు తీర్చి, కష్టాలనుంచి కడతేర్చటమే కాకుండా, వారి సంస్కారాలను అనుసరించి ఉత్తమమైన మార్గాన్ని బోధించి, తనంతటి వారిగా తీర్చిదిద్దుతున్న వైనం ఆనోట, ఈనోట ఆలకించాను, అంతేకాదు, ఎక్కడెక్కడనుంచో భక్తులను తనవద్దకు లాగి, వారి మనోభావాలననుసరించి తగురీతిన సంస్కరిస్తున్న విషయం కూడ, నా అబ్బాయిద్వారా తెలిసింది. నేను విన్న విషయం సాయిదర్శనంతో సుస్థిరమైనది. గడచిపోయిన జీవితంతోపాటు, నేటి నా చరమాంకము కూడ సార్థకత చెందాలి అంటే, "జగద్గురువైన సాయిబాబా ద్వారా మంత్రోపదేశము పొందటము ఒక్కటే మార్గం" అన్న నా మనోనిశ్చయం సాయి దర్శనంతో మరింతగా దృఢపడింది. ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన సాయిని అడిగి ఉపదేశము పొందటము అనర్హత అవుతుంది. అర్హత ద్వారా, వారి అనుగ్రహము చవిచూడాలని నా ఉద్దేశ్యము. అందుకు అర్హత నాకు ఉన్నదో లేదో అని నన్ను నేను పరీక్షించుకోవటానికి, నాకు తెలిసిన, అలవాటయిన మార్గము ఉపవాసము. తిండి, నీరు మాని నిరంతరం సాయిస్మరణతో గడుపుతున్నాను. సర్వవ్యాపి అయిన సాయికి నాదుస్థితి తెలిసి, నన్ను ఆదరించి, తగిన మంత్రోపదేశము చేసేవరకు నా ఈదీక్షను కొనసాగించదలచాను. అడగకుండానే అందరికీ అన్నీ ప్రసాదించే బాబా, నా జన్మ